# ఢిల్లీ పాలకులు మన కొద్దు



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

- బీజేపీ, కాంగ్రెస్ బూటకపు హామీలను నమ్మద్దు
- తెలంగాణపై విషం చిమ్ముతున్న రెండు పార్టీలు
- వారి పాలిత రాష్ట్రాల్లోనే రైతుల ఆత్మహత్యలు
- బీఆర్ఎస్ పాలనలోనే మన పిల్లలకు ఉజ్వల భవిత
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్

ముకరంపుర, అక్టోబర్ 1: 'ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మన కొద్దు..వారి బూటకపు హామీలను నమ్మవద్దు' అని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ప్రజలకు సూచించారు. డెబ్బై ఏండ్లల్లో ఏమీ చేయని ఆ పార్టీలు ఇప్పుడు పచ్చగా ఉన్న తెలంగాణపై విషం చిమ్ముతున్నాయని ధ్వజమెత్తారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో రూ. 1.25 కోట్లతో నిర్మించనున్న రెండు కవర్ షెడ్లు, రూ.12 లక్షలతో ఏర్పాటు చేయనున్న రైతు, ఎడ్లబండి విగ్రహానికి ఆదివారం కరీంనగర్ మేయర్ వై సునీల్ రావుతో కలిసి భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్న ఉమ్మడి రాష్ట్ర ఆఖరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణకు రావాలంటే పాస్‌పోర్టు అవసరమన్న వైఎస్ రాజశేఖరరెడ్డి కూతురు షర్మిల ఏ పాస్‌పోర్టు తీసుకుని ఇక్కడి వస్తున్నారని ప్రశ్నించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, కేవీపీ, షర్మిల కాంగ్రెస్, బీజేపీ ముసుగులు వేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీకి సద్దులు మోస్తున్న ఈ రెండు పార్టీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వీరికి అధికారమిస్తే సింగరేణి బొగ్గు, నీళ్లను తరలించుకెళ్తారని చెప్పారు. గతంలో కరెంట్, ఎరువుల కోసం ధర్నాలు చేసే పరిస్థితి ఉండేదని, కరెంటు కోసం చేసిన ఆందోళనలో తన కాలుసైతం విరిగిందని గుర్తు చేశారు. గ్రామాలను మీరు కాపాడుకుంటే మిమ్మల్ని నేను కాపాడుతానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో గ్రామాల్లో చెరువులు ఎండిపోయి, అన్నదాతలు భూములు అమ్ముకునే పరిస్థితి ఉండేదన్నారు. వరద కాల్వ నుంచి కాళేశ్వరం జలాలను కొత్తపల్లి మండలం నాగులమల్యాల చెరువుకు మళ్లించడంతో ఏడు గ్రామాలు సస్యశ్యామలమయ్యాయని చెప్పారు. వేసవిలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని వివరించారు. కాళేశ్వరం జలాలతో భూమికి బరువైన పంట పండుతుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అన్నదాతకు ఏ ఇబ్బంది లేదని రైతు బంధు, రైతు బీమా అమలవుతుంటే బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇంకా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన వేల కోట్లతో కరీంనగర్‌ను అన్నింటా ముందునిలిపామని చెప్పారు. కరీంనగర్ జిగేల్ మంటుందని, ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయని చెప్పారు. తెలంగాణ సస్యశ్యామలంగా, మనమంతా సంతోషంగా ఉండాలంటే కేసీఆర్ ను తిరిగి గెలిపించుకోవాలని కోరారు. యాదవులు, కృష్ణ భక్తుల కోరిక మేరకు కరీంనగర్‌లో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం కోసం ప్రభుత్వం మూడెకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. ఈ నెల 7న భూమిపూజ చేస్తానని, సోమవారం స్థల పరిశీలనతో పాటు చదును చేసే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముస్లిం, క్రైస్తవులతో పాటు అన్ని మతాలు సమానమేనని పేర్కొన్నారు. సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, కరీంనగర్ సొసైటీ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కర్నాటి చలమయ్య, పబ్బతి రంగారెడ్డి, గుంటి రాజమల్లు, సోమిరెడ్డి లక్ష్మారెడ్డి, గోలి మల్లయ్య, గంగాధర లస్మయ్య, అనిత, చంద్రపల్కల అంజయ్య, జనార్దన్, మహ్మద్ మహముద్ పాషా, విజయ్‌కుమార్ ముందడా, శివనాథుని వెంకటేశ్వర్లు, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఈ మునీందర్, మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం పాల్గొన్నారు.

## ఓటర్ల అనుమానాల నివృత్తికి సహాయ మిత్ర

- వివిధ అనుమానాలకు సమాధానాలు
- అందుబాటులోకి వచ్చిన సేవలు

కార్పొరేషన్, అక్టోబర్ 1: రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాల తయారీలో నిమగ్నమైంది. ఈ మేరకు ఈనెల 4న తుది ఓటరు జాబితాలను ప్రకటించనున్నారు. కాగా, ఓటర్లలో నెలకొన్న అనుమానాలను తీర్చుకునేందుకు ఎక్కడికి వెళ్లాలి.. ఎవరిని అడగాలన్న సందేహాలు ఉంటాయి. అయితే ఏ అధికారిని అడిగితే సర్లైన సమాధానం వస్తుందన్న అనుమానాలు ప్రజల్లో నెలకొంటున్నాయి. ఓటర్ల సందేహాలను తీర్చేందుకు, అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు తెలంగాణ ఎన్నికల సంఘం ఓటరు సహాయ మిత్ర పేరుతో చాట్ బాట్‌ని అందుబాటులోకి తీసుకువచ్చింది.

### *వినియోగం ఇలా*

ఎన్నికల సంఘానికి చెందిన అధికారిక వెబ్‌సైట్ ceotelangana.nic.inలోకి వెళ్లగానే కుడివైపు మూలన ఓటర్ సహాయ మిత్ర అనే లోగో కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేయడం ద్వారా మీరు చాలా ప్రశ్నలకు సమాధానాలు పొందవచ్చు. ఈ చాట్ బాట్‌లో మనం టైప్ చేయడానికి ఏమి ఉండదు. కానీ డీఫాల్ట్‌గా చాలా ప్రశ్నలు సిద్ధంగా ఉంటాయి. అంటే ఓటరు గుర్తింపు కార్డు, పోలింగ్ కేంద్రం, బూత్ స్థాయి అధికారులు, ఓటర్లను నమోదు చేసుకునే అధికారులు, కొత్త ఓటర్ సమాచారం, పాత ఓటర్ సమాచారం, ఫిర్యాదులు, రాజకీయ పార్టీలు, అసెంబ్లీ నియోజకవర్గ మ్యాప్ ఇలా చాలా ఉంటాయి. చాట్ బాట్ చూపించే ఆప్షన్లలో తమకు కావాల్సిన ఆప్షన్ క్లిక్ చేయడం ద్వారా ఓటర్లు సమాచారాన్ని పొందవచ్చు. పాత ఓటరుగా ఉంటూ తనకు సంబంధించిన సమాచారం పొందాలన్న, ఓటరు కార్డులో మార్పులు, నమోదు స్టేటస్, ఏదైనా అంశంపై ఫిర్యాదు చేయాలన్న, బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు, వారి అఫిడవిట్ల వివరాలు కావాలన్న ఎక్కడ పొందాలో లింక్‌లను ఈ చాట్ బాట్ అందిస్తుంది. ఆ లింక్‌ల ద్వారా ఓటర్లకు ఉన్న అనుమానాలను తీర్చుకునే అవకాశం ఉంటుంది. దివ్యాంగులైన ఓటర్ల కోసం ఎన్నికల సంఘం అందించే వీల్‌చైర్ వంటి ప్రత్యేక సౌకర్యాలు ఎక్కడా పొందాలో కూడా ఈ చాట్ బాట్ తెలియజేస్తుంది. ఈ చాట్ బాట్‌ని ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంది. అందువల్ల ఓటర్లు తమకు కావాల్సిన సమాచారం మొత్తం దీని ద్వారానే పొందే అవకాశం ఉంది.



ఓటరు సహాయ మిత్ర సైట్

### *ఓటర్ల అనుమానాల నివృత్తి*

ఓటర్లలో ఉండే అనుమానాలను నివృత్తి చేసే విధంగా ఎన్నికల సంఘానికి సంబంధించి అన్ని లింక్‌లను ఈ చాట్‌బాట్ అందిస్తుంది. ఆయా లింక్‌ల్లోకి వెళ్లి ఓటరు తమ అనుమానాలను తీర్చుకోవచ్చు. ముఖ్యంగా ఓటర్లకు తమ ఓటు ఉందో లేదో... పోలింగ్ కేంద్రం ఎక్కడ...... వాటిల్లో సదుపాయాలు.... పార్టీలకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కడ చేయాలి తదితర అన్ని సేవలను కూడా ఇక్కడి నుంచి పొందవచ్చు. ముఖ్యంగా ఈ చాట్‌బాట్ ఓటర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

## సింగిల్ విండో చైర్మన్‌కు సత్కారం



సింగిల్ విండో చైర్మన్ ను సన్మానిస్తున్న శ్రీనివాస్ గౌడ్

చొప్పదండి, అక్టోబర్ 1: కొలిమికుంటలోని ప్రాథమిక సహకార సంఘం ఎరువుల గోదాం ఆవరణలో శ్రమదానం చేశారు. చొప్పదండి పీఏసీఎస్‌కు జాతీయ స్థాయి అవార్డు వచ్చిన సందర్భంగా చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, సీఈవో కళ్లెం తిరుపతి రెడ్డి, డైరెక్టర్ సత్తు నర్సయ్య, లక్ష్మీరెడ్డిని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ తిరుపతి సన్మానించారు. కార్యదర్శి ప్రవళిక, వార్డు సభ్యులు ఆకుల సురేశ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మల్యాల మహేందర్, మాజీ సర్పంచ్ నేరుమట్ల మల్లేశం, తోట ప్రభాకర్ రెడ్డి, సీఏలు గంగ, మల్యాల సునీత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిరుపతి, ప్రశాంత్, రాజు, లక్ష్మణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సీతారామచంద్రస్వామి ఆలయంలో వినోద్‌కుమార్ సతీమణి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న వినోద్‌కుమార్ సతీమణి మాధవి

ఇల్లందకుంట, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి ఆదివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి రాగా అర్చకులు ఘన స్వాగతం పలికారు. అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారి జ్ఞాపికతోపాటు శాలువాతో సన్మానించారు. ఇక్కడ జడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎంపీపీ పావని-వెంకటేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, సర్పంచులు కంది దిలీప్‌రెడ్డి, మొగిళి, తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు ఎక్కటి సంజీవరెడ్డి, ఓదెలు, విజయకుమార్, మాజీ ఎంపీటీసీ రాంస్వరన్‌రెడ్డి, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు లింగారావు, పొనగంటి మల్లయ్య, రాజ్‌కుమార్, సంపత్‌రావు, మనోహర్‌రావు, శ్రీనివాస్, శ్రీరామ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, రత్నాకర్, తదితరులు ఉన్నారు.

## సీనియర్ సిటిజన్ల చట్టాల అమలుకు కృషి



కేక్ కట్ చేస్తున్న సీనియర్ సిటిజన్లు, కలెక్టర్ గోపి

- ప్రతి నాలుగో శనివారం ఫిర్యాదులు స్వీకరిస్తాం
- వయోవృద్ధుల దినోత్సవంలో కలెక్టర్ డాక్టర్ బీ గోపి

కలెక్టరేట్, అక్టోబర్ 1: జిల్లాలో సీనియర్ సిటిజన్ల చట్టాల అమలుకు కృషి చేస్తానని కలెక్టర్ డాక్టర్ బీ గోపి స్పష్టం చేశారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల నాలుగో శనివారం వృద్ధులు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. దీంతో, కలెక్టరేట్‌లో వారు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరముండదని అన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే, సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీలో వృద్ధులకు 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. డే కేర్ సెంటర్‌లో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి షెడ్డు నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడుతూ, డే కేర్ సెంటర్‌లో వైద్య సేవలు, యోగా, ఇతర సౌకర్యాల ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిదా, సీడీపీవో సబిత, వయోవృద్ధుల సంఘాల బాధ్యులు పెండ్యాల కేశవరెడ్డి, బండ సత్తయ్య, వడ్లూరు వెంకటేశం, రామస్వామి, మోసం అంజయ్య, తొడుపునూరి ఆనందం, ఉప్పుల రామేశం, చంద్రయ్య, ఉస్మాన్ పాషా, నారాయణరెడ్డి, ముదుగంటి నర్సింహారెడ్డి, హమీద్, తిరుపతమ్మ, హుస్సేన్, జీవీ రామకృష్ణారావు, శంకరయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు



యువకులకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 1: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మండలంలోని బొమ్మకల్‌లో 4వ వార్డు సభ్యుడు తోట కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 25 మంది యువకులు ఆదివారం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ సైన్యంలో పని చేసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నూకల సురేశ్, గోలి శ్రీకాంత్, బొడిగె వెంకటేశ్, బొడిగె వెంకటరమణ, సంపత్, దేవాస్, లక్ష్మణ్, రాము, పాశం సాయి, విష్ణు, మిడిదొడ్డి అజయ్, నేరెళ్ల సిద్ధు, నేరెళ్ల అజయ్, అజయ్‌గౌడ్, జగదీష్, లక్ష్మణ్, ఇందుర్తి హరీశ్, మ్యాకల నవీన్, రామ్, రాజశేఖర్, మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, ఆంజనేయులు, దాది సుధాకర్, కాల్వ మల్లేశం, కాల్వ అశోక్, జక్కినపెల్లి శంకర్, గోష్కి శంకర్, మారుతీశ్వర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.